క్లుప్తంగా

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి


డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. శనివారం కోయబస్తీలో రూ. 7 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను వాటర్‌వర్క్ మేనేజర్ తేజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులను అధికారులు పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సూపర్ వైజర్ లక్ష్మణ్‌యాదవ్, శ్రీకాంత్, లలిత, దుర్గ, శ్రీనివాస్, బుర్రి యాదగిరి, దేవేందర్, మోహన్, మహేష్, విక్రమ్, కమల్, నర్సింహ్మా, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: కళాకారులు నృత్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కృతి నృత్య అకాడమీ డాక్టర్ రోజని వల్లభనేని శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో వినాయకకౌతం, పుష్పాంజలి, చంద్రచూడ, చరణములే నమ్మితి, ఆత్మరామ, బృందావసానం, కళ్యాణరామ, శివతాండవం, రామాయణశబ్దం, ధనశ్రీ తిల్లాన తదితర అంశాలను కళాకారులు కంతి, అను, వేదం, అక్షద, రజ్వీ, సుకన్య, ఆద్య, రితిక, మహశ్రీ, ప్రదర్శించారు. అలాగే శ్రీరామ నాటక నికేతన్ గురువు మంజుల రామస్వామి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. వసుధైక కుటుంబం, శివస్తోత్రం, నటనమాడినారు, గోపిక మాధవం తదితర అంశాలను కళాకారులు వరేణ్య, స్మితిక, వర్షిక, సాన్విత, అనుష్క, ఆకృతి, వర్ష, రెబెక్కా, వంశిక, శరణ్య, సహస్ర, సంధ్య, తనుశ్రీ తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..



అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం స్వరాలాపన నిర్వహించారు. శ్రీవాణి మ్యూజిక్ అకాడమీ సంస్థ గురువు ఊటుకూరి శ్రీనివాస్ శిష్యబృందం అంతయునీవే, అన్ని మంత్రములు, షోడశకళానిధికి, ఎక్కడి మనుషజన్మము, వచ్చెను అలమేలు మంగ, కంటి శుక్రవారము, కీర్తనలను సృజన, కవిత, రామలక్ష్మి, ప్రసన్న, మహిమ, కావ్య, నివేదిత, వైష్ణవిలు ఆలపించారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శోభారాజు, సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్‌లు కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

మియాపూర్: ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద సేవా సంఘం వృద్ధాశ్రమంలో రామస్వామి ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి చందానగర్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు భార్గవ్, అబ్రహం లింకన్, డాక్టర్ షమీర్‌లతో పాటు సిబ్బంది రక్తపోటు, షుగర్, పల్స్, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. అదే విధంగా ఆరోగ్యం విషయంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. 90 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివ రామ కృష్ణ, విష్ణు ప్రసాద్, ఆశ్రమ నిర్వాహకులు సుందర ప్రసాద్, సమాజ సేవకులు వెంకట్, ఆసుపత్రి ప్రతినిధి నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉషాముళ్లపూడి రోడ్డు విస్తరణ

పూర్తయ్యేదెన్నడు?



100 ఫీట్ల రహదారి కోసం ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు నోటీసులు

- ముందుకు సాగని పనులు
- రోడ్డు మధ్యలోనే విద్యుత్ స్తంభాలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు


ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై నదిలా ప్రవహిస్తున్న వర్షపునీరు

అల్విన్‌కాలనీ: ప్రజా ప్రతినిధుల హామీలు గాలిలో బుడగలాగానే మిగిలిపోతున్నాయి. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసినప్పుడే వీరు స్పందిస్తారేమోనని స్థానికులు మండిపడుతున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ భాగ్యనగర్ కాలనీ నుంచి ఎల్లమ్మబండ మీదుగా గాజుల రామారం, ఉషాముళ్లపూడికి వెళ్లే రహదారిని 100 ఫీట్ల రహదారిగా విస్తరింపచేస్తానని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా రహదారికి రోడ్డు మధ్యలో ఉన్న ఇళ్ల, వాణిజ్య సముదాయాలకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వాలు మారాయి కానీ ప్రజా ప్రతినిధులు వారే ఉన్నారు. సమస్యలు మాత్రం తీరటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో చూసీచూడనట్లుగా, చేసి చేయనట్లుగా రోడ్డును విస్తరింపజేశారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా మమ అనిపించారు. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభాలతో నిత్యం ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సరిగ్గా కనిపించక పోవటంతో విద్యుత్ స్తంభాలను ద్విచక్ర వాహనదారులు ఢీకొని ప్రమాదాల భారిన పడుతున్నా ఎవరూ పట్టించుకోవటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం. ఈ రహదారిలో భారీ వర్షం కురిస్తే రోడ్లన్నీ జలమయమై ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్డు మొత్తం నది ప్రవహించినట్లుగా వర్షపు నీరు నిల్వ నిలిచి ఉంటుంది. గోవింద్ హోటల్ చౌరస్తాలో పలు మార్లు రోడ్డు కుంగిపోవటం, నీరు నిలిచిపోవటం వంటి నిత్యం జరుగుతుంటాయి. ఈ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చేయకుండా తూతూ మంత్రంగా పనులు చేస్తుండటంతో తిరిగి సమస్య పునరావృతం అవుతున్నది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇదే ప్రాంతంలో డ్రైనేజీ రెండు రోజుల పాటు పొంగి రోడ్లపై దుర్గంధం, దుర్వాసనతో ప్రవహించి పక్కనే ఉన్న జయనగర్ కాలనీలోకి ప్రవేశించాయి. దీంతో జయానగర్ వాసులు పలు ఇబ్బందులు పడ్డారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో విద్యుత్ లైట్లు కూడా వెలగకపోవటంతో రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటున్నది. ఈ ప్రాంతంలో పోకిరీల బెడద కూడా అధికంగా ఉంటున్నది. ఎవరు ఎలాంటి వారు, ఎప్పుడు ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితితో స్థానికులు ప్రతి రోజు బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తున్నది. దొంగల బెడద అధికంగా ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారి అయిన ఉషాముళ్లపూడి రోడ్డును త్వరగా విస్తరించాలని, విద్యుత్ స్తంభాలను పక్కకు జరిపి రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జున నగర్ రోడ్డు నంబర్ 4లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శనివారం మల్లికార్జుననగర్ రోడ్డు నంబర్ 4లో వాటర్ వర్క్స్ మేనేజర్ తేజతో కలిసి పర్యటించారు. స్థానిక సమ్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ ఓవర్ ఫ్లో అవడంతో పాటు షెల్ట్ లిఫ్టింగ్ సమస్యలు ఉన్నాయని, దీని వల్ల వర్షం పడితే రోడ్లు బురదమయం అవుతున్నాయని స్థానికులు వివరించారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మనోహర్ యాదవ్, ప్రసాద్, సత్యనారాయణ, ఓబుల్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

రాందేవ్‌రావ్ ఆసుపత్రి నర్సింగ్ సిబ్బందికి జాతీయ స్థాయి గుర్తింపు


కోర్సు పూర్తి చేసిన నర్సింగ్ స్టాఫ్ పి. శోభారాణి, ఆశజ్యోతి, జి. రాణి

కూకట్‌పల్లి: రాందేవ్‌రావ్ ఆసుపత్రి సిబ్బంది ఇండియన్ డిప్లమా ఇన్ క్రిటికల్ కేర్ నర్సింగ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి జాతీయ స్థాయి మొదటి అయిదుగురిలో ఒకరిగా నిలిచారు. హైదరాబాద్ మొత్తం 12 మంది ఉతీర్ణులు అయితే అందులో రాందేవ్‌రావ్ ఆసుపత్రికి సంబంధించిన పి. శోభారాణి, ఆశజ్యోతి, జి. రాణి ఉన్నారు. ఐడీసీసీఎన్ కోర్సును మదర్ థెరిస్సా, ఫ్లోరెన్స్ నైటింగేల్‌ని ఆదర్శంగా తీసుకుని డా. శ్రీనివాస్ సామవేదం, డా. స్మిత, డా. ధృతి ఆధ్వర్యంలో కోర్సు పూర్తి చేశారు. మొదటి పది మందిలో రెండు ర్యాంకులు రాందేవ్ రావు ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది సాధించినందుకు ఆసుపత్రి యాజమాన్యం విక్రందేవ్‌రావ్, మీరా రావు, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణ రావ్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిక్షణలు పొందేలా ఎల్లప్పుడు ప్రోత్సహిస్తాయని ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా. కె. కమలాకర్, సీఈఓ డా. యోబు తెలిపారు.

నేలకొరిగిన చెట్ల కొమ్మల తొలగింపు



మోతీనగర్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నేలకొరిగిన చెట్లను, కొమ్మలను శనివారం మూసాపేట సర్కిల్, అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. అదే విధంగా చెట్లు కూలి విద్యుత్‌కు అంతరాయం కలగటంతో విద్యుత్ సిబ్బంది విద్యుత్ వైర్లను సరిచేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

రక్షా బంధన్

ఘనంగా రాఖీ పండుగ


మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కడుతున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

కూకట్‌పల్లి జోన్‌బృందం: అనురాగానికి, ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను శనివారం నియోజకవర్గంలో ఘనంగా జరుపుకున్నారు. సోదరీమణులు తమ అన్నలు, తమ్ముళ్ల చేతికి రాఖీ కట్టారు. వారి రక్షణకు సంకల్పం కోరుతూ పరస్పర ప్రేమను పంచుకున్నారు. వాడవాడలా సోదరీమణులు వారి సోదరులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, పలు పార్టీల నాయకులకు పార్టీ కార్యకర్తలు, నాయకురాళ్లు, అభిమానులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే కృష్ణారావుకు రాఖీ శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు


ఎమ్మెల్యే కృష్ణారావుకు దట్టీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ సబిహా బేగం


వి రామారావునగర్‌లో తమ సోదరులకు రాఖీలు కట్టిన సోదరీమణులు


రక్షాబంధన్ వేడుకల్లో డిపో మేనేజర్ డి.హరి, ఉద్యోగులు


కేపీహెచ్‌బీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళలు


టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కురుమ నరేందర్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


రాఖీలు కట్టిన మహిళలతో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దంపతులు

అన్ని హంగులతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

- పంక్షన్‌హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

అల్విన్‌కాలనీ: అన్ని హంగులతో మల్టీపర్సస్ పంక్షన్‌హాల్ నిర్మాణం అందుబాటులోకి వచ్చిందని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అడ్డగుట్ట కాలనీలో రూ.6.36 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ ఫంక్షన్ హాల్‌లో స్టేజీ, రెండు గదులు, దీపాలు, విశాలమైన హాలు, అధునాతన టైల్స్, పార్కింగ్ వంటి సకల వసతులతో నిర్మించామన్నారు. అందరు కలిసి కాలనీ అభివృద్ధికి పాటు పడాలని, కాలనీ సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని సూచించారు. హైదర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

ప్రజల సౌకర్యార్థం భాగ్యనగర్‌కాలనీ, అడ్డగుట్ట, ఆదిత్యనగర్, రామ్‌నరేష్ నగర్, భాగ్యనగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ గాంధీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధికి గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1650 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

పొంగి పొర్లుతున్న డ్రైనేజీ!



మోతీనగర్: కొన్ని రోజుల నుంచి డ్రైనేజీ పొంగి పొర్లడంతో రోడ్డంతా బురదమయంగా తయారైంది. మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీ మోతీనగర్ నుంచి బోరబండకు వెళ్లే ప్రధాన రోడ్డు విజేత థియేటర్ సమీపంలో హోటల్ నుంచి తినుబండారాల వ్యర్థాలు, మిగిలిన ఆహార పదార్థాలను డ్రైనేజీలోకి వేయటం వల్ల డ్రైనేజీ పొంగుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హోటల్‌కు ప్రత్యేక డ్రైనేజీ లేకపోవడంతో పక్కనే ఉన్న ఇంటి యజమాని డ్రైనేజీలోకి వేయటంతో అది నిండి దుర్గంధం వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పొంగుతున్న డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేయాలని, హోటల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ శ్రీహరి నగర్ కాలనీలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కలికోట శంకర్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరీఫ్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు సుల్తాన్, కూకట్‌పల్లి జనరల్ సెక్రటరీ శ్రవణ్, అప్సార్, పవన్, చిన్నా, విక్రమ్, అంజి పాల్గొన్నారు.

మూసాపేటలో...

మూసాపేటలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షేక్ మోసిన్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు జరిగాయి. అనంతరం మూసాపేటలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మారుతున్న వాతావరణం దృష్ట్యా ప్రతి ఒక్కర్ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్నా పాషా, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీహరి నగర్‌లో మొక్క నాటుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు